చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	250

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 23.4

అతివేగం.. కూలీల బతుకులు ఛిద్రం

వారంతా రోజువారీ కూలీలు.. వయస్సు మీద పడినా కుటుంబానికి ఆసరాగా నిలవాలని తపించే మనస్సులు.. రోజంతా కష్టపడితే వచ్చే రూకలతో జీవితాన్ని గడుపుతున్న బడుగు జీవులు.. మిర్చి ఏరేందుకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో అతివేగానికి బలయ్యారు. కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలతో పాటు మరో కూలీ మృతి చెందాడు. హృదయ విదారక ఘటన మోతె మండల కేంద్రం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుల కుటుంబ సభ్యుల రోదనతో ఘటనా ప్రాంతంతో పాటు సూర్యాపేట ఆసుపత్రి ప్రాంతాలు కన్నీటి పర్యంతమయ్యాయి.

(మోతె / సూర్యాపేట సిటీ)



సూర్యాపేట జిల్లా మోతె మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో



- కూలీల ప్రాణాలు మింగిన అతివేగం
- ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఐదుగురు కూలీలు మృతి
- మృతుల్లో భార్యాభర్తలు
- మోతె మండల కేంద్రంలో విషాదం

సూర్యాపేట జిల్లా మోతెలో కూలీలతో వెళ్తున్న ఆటోను బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలు, మరో కూలీ మృత్యువాత పడ్డారు. రోజు మాదిరిగానే మోతె మండలంలో మిర్చి పంట ఏరేందుకు ఆటోలో వస్తుండగా ఖమ్మం జిల్లా మధిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అండర్‌పాస్ నుంచి బయటకు వస్తూ నర్సింహులగూడెం వైపు నుంచి హుస్సేనాబాద వైపు సర్వీస్ రోడ్డులో వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. అతివేగంగా ఢీకొనడంతో సుమారు 50 మీటర్లకు పైగా ఆటో పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి మట్టిరోడ్డుపై పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న మునగాల మండలం విజయరాఘవాపురం గ్రామానికి చెందిన కందుల నాగమ్మ(60), చెరుకు నారాయణమ్మ(60), రేపాల గ్రామానికి చెందిన పోకల అనుసూర్యమ్మ(65)లు అక్కడికక్కడే మృతి చెందారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న స్థానికులు, బస్సులోని ప్రయాణికులు గాయాలైన మిగతా కూలీలను 108 వాహనాల్లో సూర్యాపేటలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయరాఘవాపురం గ్రామానికి చెందిన రెమిడాల సౌభాగ్యమ్మ(58), కందుల గురువయ్య(63) మృతి చెందారు. మరో మహిళ సోమపంగు లక్ష్మీ పరిస్థితి విషమంగా ఉంది. ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అదేవిధంగా ఆటో డ్రైవర్ సోమపంగు పవన్‌తో పల్లపాటి మంగమ్మ, సోమపంగు అనుసూర్య, పల్లపాటి రాములమ్మ, కత్తి విజయమ్మ, బెల్లంకొండ సరస్వతి, నరహరి రామచంద్రమ్మలు సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అర సెకను తప్పినా...

రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన బస్సు ఆటోను మధ్య నుంచి చివరి భాగంలో ఢీకొట్టింది. బస్సు కనురెప్ప పాటు ఆలస్యంగా వచ్చినా ప్రమాదం తప్పేది. రోడ్డు దాటిన తర్వాత అర నిమిషం వ్యవధిలో కొద్దిదూరంలోని కూలీలు వెళ్లాల్సిన చోటకు క్షేమంగా వెళ్లేవారు.

మృతులంతా నిరుపేదలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారు నిరుపేదలే. కూలి డబ్బులతో కుటుంబానికి ఆసరాగా ఉంటామని వెళ్తుంటారు. మృతుల్లో అందరు 58ఏళ్లకు పైబడిన వారు. అందరి పిల్లల వివాహాలు కాగా కూలి డబ్బులు కుటుంబానికి ఆసరాగా ఉంటాయని ఈ వయసులోనూ కష్టపడుతున్నారు. మృతుల్లో కందుల గురువయ్య, కందుల నాగమ్మలు వీరరాఘవాపురం గ్రామానికి దంపతులు. సంఘటనా స్థలాన్ని ఆర్టీసీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ పరిపూర్ణ పరిశీలించారు. ఆయనతో పాటు ఖమ్మం, సూర్యాపేట, మధిర డిపోల డీఎంలు కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ యాదవేందర్‌రెడ్డిలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాద వివరాలను సేకరించారు. మృతుల బంధువులు బెల్లంకొండ స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



108 వాహనంలో క్షతగాత్రులను తరలిస్తున్న స్థానికులు

ఆసుపత్రిలో మిన్నంటిన రోదనలు

మోతె ఘటనకు సంబంధించిన క్షతగాత్రులతో పాటు మృతదేహాలను సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు ఆసుపత్రిలో మిన్నంటాయి. ఒకరిపై ఒకరు తలలు వాల్చుకుని కన్నీరు పెట్టారు. ఈ దృశ్యాలు ప్రతిఒక్కరినీ కంటతడి పెట్టించాయి. చికిత్స జరుగుతున్న సమయంలో క్షతగాత్రుల బంధువులు అత్యవసర వైద్య విభాగం దగ్గరకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది.



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు

ఉలిక్కిపడ్డ మోతె

మతే మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. తమ కళ్లెదుటే ముగ్గురు మహిళలు చనిపోవడం, తొమ్మిది గాయపడటం వారిని కలిచివేసింది. మండలంలో మిరప సాగు ఎక్కువగా చేస్తారు. స్థానికంగా కూలీలు లేకపోవడంతో ఇతర గ్రామాల నుంచి తీసుకువస్తుంటారు. అలా వస్తూనే బుధవారం కూలీలు రోడ్డు ప్రమాదంలో చనిపోవడం రైతులను కలిచివేసింది.

వేగంగా అందిన చికిత్సలు

రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు జనరల్ ఆసుపత్రిలో వేగంగా చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడి రక్తస్రావాలతో ఆసుపత్రికి చేరిన బాధితులకు ప్రథమ చికిత్సను అందించి, వైద్యపరీక్షలు నిర్వహించారు. కాళ్లు, చేతులు విరిగిన వారికి వెంటనే కట్లు కట్టి వైద్యం అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రెడ్డి వైద్యసేవల ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. సుమారు 10 మందికిపైగా వైద్యులు ప్రథమ చికిత్స వేగంగా అందించడంలో చొరవ చూపారు.

రేపాల, విజయరాఘవాపురంలో విషాదఛాయలు

మునగాల: రెక్కాడితే కానీ డొక్కాడని కూలీల కుటుంబాలు కూలిపోయాయి. విజయరాఘవాపురం గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ(55), కందుల నాగమ్మ(56), కందుల గురువయ్య(65) రెమిడాల సౌభాగ్యమ్మ(55), రేపాల గ్రామానికి చెందిన పోకల అనసూర్యమ్మ (60), మరో 8 మంది కూలీలతో కలసి మొత్తం 12మంది ఆటోలో కూలీ పనులకు వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. 10 రోజులుగా మిర్చి ఏరే పనులకు వెళ్తున్నారు. ప్రతి రోజూ కూలీ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండే వారి కుటుంబాలలో బస్సు మృత్యు రూపంలో విషాదం నింపింది. ఇదిలా ఉండగా మృతుల్లో విజయరాఘవాపురం గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ ఒంటరి మహిళ. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కందుల గురువయ్య, నాగమ్మలు దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉండగా, వారికి వివాహలయ్యాయి. వీరందరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో వృద్ధదంపతులిద్దరూ కన్నుమూశారు. దీంతో కుటుంబం తల్లడిల్లుతోంది. రెమిడాల సౌభాగ్యమ్మకు ముగ్గురు కుమార్తెలు కాగా వారికి వివాహలయ్యాయి. భర్త కొన్నేళ్ల కిందట మృతితో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. రేపాల గ్రామానికి చెందిన పోకల అనసూర్యమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరికీ వివాహలయ్యాయి. భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. ఆమె కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది.



ఆదుకుంటాం : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మోతె మండలం జాతీయరహదారిపై ప్రమాద ఘటనపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు, ఎస్పీ రాహుల్‌హెగ్డేలను ఆదేశించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఆయన హామీఇచ్చారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు: కలెక్టర్

మోతె ఘటనకు సంబంధించిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు ఆదేశించారు. ఆసుపత్రి చికిత్స పొందుతున్న వారిని ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలిసి పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలను అందించాలని సూపరింటెండెంట్ మురళీధర్‌రెడ్డిని ఆదేశించారు. గాయపడిన వారికి అందుతున్న వైద్యసేవలను కలెక్టర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

ఉమ్మడి జిల్లాకు సాగుబడి

- కంపసాగర్‌లో వ్యవసాయ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు నిర్ణయం



త్రిపురారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం

నల్లగొండ, ఫిబ్రవరి 28: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నూతన వ్యవసాయ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల వారీగా ఎనిమిది కళాశాలలు ఉండగా, ఈ కోర్సులకు విద్యార్థుల నుంచి డిమాండ్ పెరగడంతో నిజామాబాద్ జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాలో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. జిల్లాలోని త్రిపురారం మండలం కంపసాగర్‌లో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని కంపాసాగర్ ప్రాంతంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పెద్దఎత్తున విస్తీర్ణంలో ఉండటంతో పాటు కంపసాగర్‌లో విత్తనోత్పత్తితోపాటు శాస్త్రవేత్తలు ఉండటం వల్ల అందులో కళాశాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ కళాశాలను ఏర్పాటు చేసినట్లయితే వ్యవసాయ కళాశాలకు సార్థకత చేకూరనుంది.

కళాశాలకు అనువైన ప్రాంతంగా కంపసాగర్

త్రిపురారం మండలంలోని కంపసాగర్‌లో ప్రభుత్వ భూమి సుమారు 280 ఎకరాల వరకు ఉంది. కంపసాగర్ కృషివిజ్ఞాన కేంద్రానికి 50 ఎకరాలు కేటాయించారు. ఈ కేంద్రంలోనే కళాశాలను నిర్మిస్తారా? లేదా? కృషి విజ్ఞాన కేంద్రం పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో కళాశాల భవనం నిర్మిస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నందున అధికారులు కంపసాగర్‌ను సందర్శించి నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందించనున్నారు. వ్యవసాయాన్ని ఆర్థికంగా లాభదాయకంగా, పర్యావరణపరంగా, సామాజిక న్యాయంగా మార్చడానికి ఈ కళాశాల ఉపయోగపడనుంది. సమాజ అభివృద్ధికోసం వ్యవసాయ విద్యను మరింత సమర్థవంతంగా చేయడంకోసం వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయన్ని మరింత లాభదాయకంగా చేయడానికి, రైతులకు సహాయంగా ఉండటానికి, వ్యవసాయంలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర పరిశోధనల ద్వారా రైతులకు మేలు చేయడంకోసం వ్యవసాయ కళాశాల ఉపయోగపడనుంది. వ్యవసాయ కళాశాలలో డిగ్రీ చేసే విద్యార్థులకు ప్రాథమికంగా, శాస్త్రీయంగా వ్యవసాయం ఎలా చేయాలనే దానిపై వారికి తర్ఫీదు ఇవ్వనున్నారు. ఈకళాశాలలో విద్యలో భాగంగా ఆత్మవిశ్వాసంతోపాటు సామర్థ్యాలను కూడా పెంపొందిస్తారు. విద్యార్థుల్లో వ్యవసాయ నైపుణ్యాలను పెంపొందించడం, వ్యవసాయ పరిశోధన ధోరణిని నేర్పించడంపై అవగాహన కల్పిస్తారు.

అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి బదిలీ

యాదాద్రి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయనను హెచ్ఎండీఏ ఎస్టేట్ అధికారిగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో అదనపు కలెక్టర్‌గా ఎవరికీ బాధ్యతలు కేటాయించలేదు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక పార్లమెంట్ నియోజకవర్గాల్లోని అధికారులను బదిలీచేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన్ను ప్రభుత్వం బదిలీ చేసింది.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 28: రాబోయే పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాధికారి కే.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 18 నుంచి ఏప్రిల్ 2వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో వసతులు, సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల సమయం, నిర్వహణపై ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల అనుమతి లేదని, దివ్యాంగులకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

భువనగిరి మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలో

గెలుపు మలుపులెన్నో

- చైర్మన్ కాంగ్రెస్‌కు, వైస్‌చైర్మన్ బీజేపీకి
- చైర్మన్‌గా పోతంశెట్టి వెంకటేశ్వర్లు ఎన్నిక
- వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మాయ దశరథ
- ఎన్నికకు దూరంగా ఉన్న బీఆర్ఎస్



మునిసిపల్ చైర్మన్, కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేశ్వర్లుకు మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు



చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ దశరథ

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 28: భువనగిరి మునిసిపల్ రాజకీయం ఊహించని మలుపు తిరిగింది. మూడు ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని క్యాంపు రాజకీయాలకు తెరలేపగా, చివరికి చైర్మన్ పీఠం కాంగ్రెస్‌కు దక్కింది. ఉత్కంఠ పరిణామాల నడుమ జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా కాంగ్రెస్‌కు చెందిన పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్‌గా బీజేపీకి చెందిన మాయ దశరథ గెలుపొందారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.జయశ్రీ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యుడితో కలిపి 36 మందికి 30 మంది హాజరయ్యారు. వీరిలో 29మంది కౌన్సిలర్లుండగా ఎక్స్‌అఫీషియో సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వచ్చారు. కోరం సమకూరిన వెంటనే చైర్మన్ పదవులకు నామినేషన్లను కోరుతూ అప్పటికే కాంగ్రెస్ అభ్యర్థిగా 29వ వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి వెంకటేశ్వర్లును పేర్కొంటూ ఆ పార్టీ విప్ అందజేసిన లేఖను చదివి వినిపించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు కాంగ్రెస్ అభ్యర్థిగా 29వ వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి వెంకటేశ్వర్లును 11వ వార్డు కౌన్సిలర్ జిట్టా వేణుగోపాల్‌రెడ్డి ప్రతిపాదించగా 28వ వార్డు కౌన్సిలర్ ఖైరంకొండ వెంకటేశ్ బలపర్చారు. అనంతరం బీజేపీ అభ్యర్థిగా 22వ వార్డు కౌన్సిలర్ బొర్ర రాకేష్‌ను అదే పార్టీకి చెందిన 9వ వార్డు సభ్యురాలు నల్లమాస సుమ ప్రతిపాదించగా 21వ వార్డు సభ్యుడు ఉదయగిరి విజయ్‌కుమార్ బలపర్చారు.

చైర్మన్ పదవి రేసులో బీఆర్ఎస్ దూరం

బీఆర్ఎస్ ఇటీవలి వరకు పాలకపక్షంగా ఉండి తాజాగా మూడు వర్గాలుగా చీలి కొద్ది మంది సభ్యులు హాజరైనప్పటికీ చైర్మన్, వైస్‌చైర్మన్ పోటీకి దూరంగా ఉన్నారు. అనంతరం చేతులెత్తే విధానంలో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యే కుంభం, 17 మంది సభ్యులు మొత్తంగా 18 మంది చేతులెత్తారు. అనంతరం బీజేపీ అభ్యర్థికి కేవలం ఆరుగురు మాత్రమే మద్దతు తెలుపడంతో కాంగ్రెస్ అభ్యర్థి పోతంశెట్టి వెంకటేశ్వర్లు చైర్మన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఆ వెంటనే బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశం హాల్ నుంచి వెళ్లిపోయారు. అనంతరం నిర్వహించిన వైస్‌చైర్మన్ ఎన్నికకు బీజేపీ అభ్యర్థిగా 25వ వార్డు కౌన్సిలర్ మాయ దశరథను అదే పార్టీకి చెందిన 24వ వార్డు కౌన్సిలర్ రత్నపురం బలరాం ప్రతిపాదించగా 13వ వార్డు కౌన్సిలర్ జనగాం కవిత బలపర్చారు. వైస్‌చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్ తమ అభ్యర్థిని ప్రతిపాదించకపోవడంతో బీజేపీ అభ్యర్థి మాయ దశరథ ఏకగ్రీవంగా వైస్‌చైర్మన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌కు ధ్రువీకరణ పత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం కూడా చేయించారు. సమావేశంలో ఇన్‌చార్జి కమిషనర్ కొండల్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవి కిరణ్‌కుమార్, చెన్న స్వాతి, గోమారి సుధాకర్‌రెడ్డి, అందె శంకర్ గైర్హాజరయ్యారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ రాజీనామా

చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక పూర్తయిన వెంటనే పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశ హాల్ నుంచి అసంతృప్తితో వెనుదిరిగారు. ఆ రెండు పదవులను ఆశించినప్పటికీ తమను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి నిరాశ పరిచారని పేర్కొంటూ పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తంచేస్తూ వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో 20వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ పచ్చర్ల హేమలత వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి రాజీనామాపత్రాన్ని ఇన్‌చార్జీ కమిషనర్ కొండల్ రావుకు అందజేసి వెళ్లిపోయారు.

మునిసిపల్ సేవల్లో మార్పులు చూపిస్తాం : ఎమ్మెల్యే



భువనగిరి మునిసిపల్ సేవల్లో గతంతో పోలిస్తే పలు మార్పులు చూపిస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. నూతన చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి మునిసిపల్ కార్యాలయంలో విలేకరులతో మాటాడుతూ మెరుగైన సేవలను అందిస్తామన్నారు.

కేంద్రం నిధులను తెస్తాము : దశరథ

భువనగిరి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను తెస్తామని నూతనంగా ఎన్నికైన మునిసిపల్ వైస్‌చైర్మన్ దశరథ అన్నారు. పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

చైర్మన్ ఎన్నికలో క్రాస్ ఓటింగ్

చేతులెత్తే విధానంలో జరిగిన చైర్మన్ ఎన్నికలో క్రాస్ ఓటింగ్ జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి పోతంశెట్టి వెంకటేశ్వర్లుకు మద్దతుగా 18 మంది చేతులు ఎత్తారు. 2020లో జరిగిన మునిసిపల్ సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి గెలుపొందిన 11మంది, ఎక్స్ ఆఫీషియో హోదాలో ఎమ్మెల్యే కుంభం, ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ముగ్గురు బీఆర్ఎస్ అసంతృప్త కౌన్సిలర్లు కాగా మరొకరు మునిసిపల్ సాధారణ ఎన్నికల్లో బీజేపీ నుంచి గెలుపొంది ఇటీవలే అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరిన ఆ కౌన్సిలర్ కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారు. బీజేపీ అభ్యర్థి రాకేష్‌కు అదే పార్టీకి చెందిన ఆరుగురు మద్దతు తెలిపారు. చైర్మన్ లేదా వైస్‌చైర్మన్ పదవికి ముమ్మర ప్రయత్నాలు చేసిన బీఆర్ఎస్‌కు చెందిన ఎండి అజీమొద్దీన్ సహా ఆపార్టీకి చెందిన ఆరుగురు కౌన్సిలర్లు హాజరైనప్పటికీ చైర్మన్ పోటీలో ఎవరూ నిలువలేదు.



సమాజానికి ఉపయోగపడే

పరికరాలు కనుగొనాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రశాంతిరెడ్డి
- జిల్లావ్యాప్తంగా సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

చౌటుప్పల్‌లో ట్రినిటీ పాఠశాలలో ప్రదర్శనలను తిలకిస్తున్న ప్రశాంతిరెడ్డి

8

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 28: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో బుధవారం ప్రారంభమయ్యాయి. 30 పరీక్ష కేంద్రాల్లో మొదలైన ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం 6,575మంది విద్యార్థులకు 6,180మంది హాజరుకాగా, 395 మంది వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు. తొలిరోజు తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పాఠ్యాంశాలకు సంబంధించి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు నోడల్ అధికారి సీ.రమణి తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయగా, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించారు. అదేవిధంగా నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున ఉరుకులు పరుగులతో గంట ముందు నుంచే కేంద్రాలకు కొంతమంది విద్యార్థులు చేరుకోగా, మరికొంత మందిని తల్లిదండ్రులు కేంద్రాల వద్దకు తీసుకొచ్చారు. అదే విధంగా నేటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభంకానున్నాయి. 6,431 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.



పరీక్ష కేంద్రంలో వస్తున్న విద్యార్థినులు

గుర్తుతెలియని జంతువుల దాడిలో 110గొర్రెల మృతి

తుంగతుర్తి, ఫిబ్రవరి 28: గుర్తు తెలియని జంతువుల దాడిలో 110 గొర్రెలు మృతి చెందగా, మరో15 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన దాయం రవీందర్‌రెడ్డి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గొర్రెలఫాంలో 250గొర్రెలను పెంచుతున్నాడు. గొర్రెలను ఫాంలో ఉంచి, ఫాంహౌస్ పక్కన ఉన్న గదిలో నిద్రపోయాడు. బుధవారం ఉదయం నిద్రలేచేసరికి 110గొర్రెలు మృతి చెంది, మరో 15గొర్రెలు తీవ్రంగా గాయపడి ఉన్నాయి. ఈ సమాచారాన్ని వెంటనే వెంపటి పశువైద్యాధికారి మమతకు తెలియజేయగా, ఆమె అక్కడికి చేరుకుని కళేబరాలను పరిశీలించారు.



కుక్కలు, తోడేళ్ల, నక్కల వంటి జంతువుల దాడిలో ఇలాంటి ఘట నలు జరుగుతాయని పశువైద్యాధికారి తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు అందజేస్తామన్నారు. గొర్రెల పెంపకందారుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గొర్రెల మంద చుట్టూ ఫెన్సింగ్ ఉండగా, ఒక చోట పైకిలేపి ఉందన్నారు. తనకు రూ.15లక్షల విలువైన నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరాడు.

ఇరిగేషన్ డీఈఈ పై చర్యలు తీసుకోవాలి

నాగారం, ఫిబ్రవరి 28: సూర్యాపేట జిల్లా నాగారం ఇరిగేషన్ డీఈఈ పిచ్చయ్యపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ వడ్డే పరశురాములు, ఈదుల కిరణ్, వర్ధమానుకోట రైతులు వంగూరి సోమ నర్సయ్య, వడ్డే వెంకటయ్య, మేడి మల్లేష్ తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం వర్ధమానుకోటలో విలేకరులతో వారు మాట్లాడుతూ మండలంలోని వర్ధమానుకోటలో పెద్దచెరువులో చేపలు పట్టడానికి చేపల కాంట్రాక్టర్ నీటిని బయటకు వదులుతున్నాడని తెలిపారు. చెరువులో నీటిని బయటికి వదులుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డీఈఈ పిచ్చయ్యకు ఫిర్యాదు చేయగా, పొంతనలేని సమాధానాలు చెబుతూ చేపల కాంట్రాక్టర్‌కు సహకరించేలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. చేపల కాంట్రాక్టర్‌కు సహకరిస్తున్న డీఈఈ పిచ్చయ్యపై ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుని, చెరువును ఎస్సారెస్పీ జలాలతో నింపి పైర్లను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ఇటుకాల మహేందర్, ఈదుల రమేష్ జలందర్, రమేష్, పి.కిరణ్ పాల్గొన్నారు

● వర్ధమానుకోట పెద్ద చెరువులో నీటిని బయటికి వదలడానికి ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని డీఈఈ పిచ్చయ్య తెలిపారు. చేపల కాంట్రాక్టర్‌కు సహకరించలేదన్నారు. చెరువు నీటిని అనధికారికంగా తొలగించినవారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీ అయిన చెరువును ఎస్సారెస్పీ జలాలతో రెండో రోజుల్లో నింపుతామన్నారు.



వర్ధమానుకోట గ్రామంలో మాట్లాడుతున్న రైతులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాగారం, ఫిబ్రవరి 28: సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని పేరబోయిన్స్ గూడెంలో బిక్కేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను బుధవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వెంకటరెడ్డి తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ట్రాక్టర్ యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని మఠంపల్లి క్షేత్రంలో బుధవారం శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ... చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ... సిరికొండ ... తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి, శేషగిరిరావు, రాజేష్, భక్తులు పాల్గొన్నారు

మిగులు భూమిని మింగేశారు!


మునుగోడులో చేనేత సహకార సంఘానికి కేటాయించిన ప్రభుత్వ స్థలం

- చేనేత సంఘానికి 20గుంటల కేటాయించిన ప్రభుత్వం
- మిగులు 10గుంటల రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనం
- కొనుగోలు పేరుతో కోట్ల విలువైన భూమి స్వాహా
- మునుగోడులో అలస్యంగా వెలుగులోకి వచ్చిన దందా

మునుగోడు, ఫిబ్రవరి 28: ప్రభుత్వ మిగులు భూమిని గుర్తించిన కొందరు నేతలు స్వాహా పర్వానికి తెరలేపారు. కొత్తగా చేనేత కార్మికుల పేరుతో ఏర్పాటు చేసిన అసోసియేషన్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పేరున గ్రామపంచాయతీ రికార్డుల్లో సైతం ఆ స్థలాన్ని నమోదు చేయించారు. పక్కన ఉన్న భూమిని కూడా కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేయించుకొని అధికారికంగా హక్కులు పొందారు. మునుగోడులో రెండేళ్ల క్రితం జరిగిన ఈ అక్రమ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో బాధిత నేత కార్మికులు, వివిధ ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమానికి కొందరు అధికారులు సహకారం అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

స్వాహా పర్వం తీరు

మునుగోడు నియోజకవర్గకేంద్రంలో చేనేత కార్మికులు తమ వృత్తి నైపుణ్యత పెంచుకోవడంతో పాటు తయారు చేసిన వస్త్రాలు వంటి వివిధ సరుకులను సొంతంగానే విక్రయించడానికి మార్కెట్ సౌకర్యంతో ఉపయుక్తంగా ఉంటుందని చేనేత సంఘం నేతలు ప్రభుత్వానికి విన్నవించారు. 2018లో అప్పటి ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి వెంట ఉన్న సర్వే నెంబరు 78లో 20గుంటల విస్తీర్ణం భూమి కేటాయించింది. ఆ భూమికి చట్టప్రకారం హక్కులు కల్పించింది. అందులో మిగులుగా ఉన్న సుమారు 10గుంటల (1057చదరపు అడుగులు) స్థలంపై సొసైటీ నాయకులు కన్నేశారు. నేత బజారు వీవర్స్ అసోసియేషన్ అంటూ కార్మికుల పేరుతో 2019లో కొత్తగా సొసైటీని ఏర్పాటు చేశారు. సహకార సంఘం పాలకవర్గం నేతలే ఆ సొసైటీ కార్యవర్గంగా ఉన్నారు. గ్రామపంచాయతీ రికార్డులో సైతం ఆ స్థలాన్ని కూడా నమోదు చేయించారు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకొని మార్కెట్ లెక్కల ప్రకారం కోట్ల రూపాయల విలువగల ప్రభుత్వ భూమిని ఆ నేతలే సొంతంగా రూ.17.59 లక్షలకు కొనుగోలు చేసినట్లుగా ఆ సొసైటీ పేరుతో తమ పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

పలు అనుమానాలు

ఇందులో అమ్మకందారులు ఇద్దరు, కొనుగోలు దారులైన నలుగురిలో అమ్మిన ఇద్దరూ ఉండడం గమనార్హం. ఈ తతంగం 2021లో జరిగినట్లు అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలు రికార్డులు రుజువు చేస్తున్నాయి. కానీ ప్రభుత్వం ఇచ్చిన 20గుంటల భూమికి ధ్రువీకరణ పత్రం సొసైటీ పేరున ఉన్నట్లు చూపిన విధంగా 10గుంటల భూమికి ఎలాంటి ధ్రువీకరణ పత్రం లేనట్లు తెలిసింది. అదే భూమిని రిజిస్ట్రేషన్ ద్వారా మార్పిడి చేయించారు. అందులో అమ్మకందారులే కొనుగోలు దారుల్లో ఉండడం, ఈ రెండు వేర్వేరుగా ఉన్న స్థలాల వివరాలు మాత్రం గ్రామపంచాయతీ రికార్డులో వరుస క్రమంలో నమోదు కావడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ తతంగం ఆలస్యంగా వెలుగు చూడడంతో కార్మిక సంఘా లు, వివిధ ప్రజాసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఎవ రి స్వప్రయోజనాల కోసం కాదని కేవలం కార్మికులు, సహకార సంఘం అభివృద్ధి కోసమే అంటూ సదరు నేతలు దాటవేసే ధోరణిని ప్రదర్శిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమి కాపాడి కార్మికుల శ్రేయస్సు కోసం ఉపయోగించాలని పలువురు కోరుతున్నారు.

రేకుల షెడ్ ధ్వంసం

చేనేత సహకార సంఘం నేతలు ఆ స్థలంలో చట్టూ బేస్‌మెంట్ ఎత్తులో పిల్లర్లను నిర్మించి రెండు గదుల వెడల్పుతో ఓ రేకుల షెడ్ నిర్మించారు. గత ఏడాది ఈదురు, గాలులకు ఆ షెడ్ రేకులు లేచి ధ్వంసమయ్యాయి. అవి మళ్లీ నిర్మాణం కాలేదు. అక్కడ కంపచెట్లు ఆవరించి ఉన్నాయి. మునుగోడు-చండూరు ప్రధాన రహదారి వెంట ఉన్న ఈ స్థలాలు అభివృద్ధి కోసం ఉపయోగిస్తామన్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్ఆర్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 20 గుంటలతో పాటు సుమారు 10గుంటలు స్థలం చొప్పున రికార్డులో వేర్వేరుగా నమోదైన విషయం వాస్తవమే అని అన్నారు. రిజిస్ట్రేషన్ విషయం మాత్రం తెలియదని పేర్కొన్నారు.

ప్రభుత్వ మిగులు భూమి ఆక్రమిస్తే చర్యలు

మునుగోడులో మిగులుగా ఉన్న ప్రభుత్వ భూమి విక్రయమై అక్రమం జరిగిందన్న విషయం మా దృష్టికి రాలేదు. భూమి అక్రమ వ్యవహారం జరిగినట్టు ఫిర్యాదు వస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

● నరేందర్, తహసీల్దార్, మునుగోడు.

ప్రజలు కమ్యూనిస్టు పార్టీలను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

సంస్థాన్ నారాయణపురం ఫిబ్రవరి 28: పేద ప్రజలు, కార్మికులు, అణగారిన వర్గాల ప్రజల కోసం పోరాటాలు చేసేవారు సమాజంలో తగ్గుతున్నారని, ఇలాంటి తరుణంలో ప్రజలు ఎర్రజెండాను, కమ్యూనిస్టు పార్టీలను కాపాడు కోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో కోతులాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన సీపీఐ నాయకుడు దివంగత కురిమిద్దె లింగయ్య ప్రథమ వర్ధంతిలో మాట్లాడారు. సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపేందుకు, ప్రజల పక్షాన ఎర్రజెండా పోరాడుతుందన్నారు. నల్లగొండ జిల్లా పోరాటాలకు పుట్టిల్లు అని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పోరాటాలకు నల్లగొండ జిల్లా ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఎంతోమంది కమ్యూనిస్టులు వీర యోధులకు జన్మనిచ్చిన త్యాగాలగడ్డ నల్లగొండ జిల్లా అని అన్నారు. నల్లగొండ కాదు ఇది ఎర్రగొండ అని పేర్కొన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాచకొండలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా లింగయ్య ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని గుర్తుచేశారు. రాచకొండ గుట్టలో మిగులు భూములను అర్హులైన గిరిజనులు పేదలకు పంపిణీ చేయాలని ఎన్నో భూ పోరాటాలు నిర్వహించి భూ పంపిణీ చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీపీఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధిగా లింగయ్య ఎంతో కృషిచేశారన్నారు. అంతకుముందు లింగయ్య విగ్రహాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, స్మారక స్తూపాన్ని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్దె శ్రీనివాస్, బచ్చనగొని గాలయ్య, దుబ్బాక భాస్కర్, పల్లె శేఖర్‌రెడ్డి, పొట్ట సత్యం, పొట్ట శంకరయ్య, చిలువేరు అంజయ్య, ఇద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెండిజోడు సేవోత్సవం



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి28: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం అలంకార వెండిజోడు సేవలు, నిత్య పూజాకైంకర్యాలు వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయం భువులను మేల్కొలిపిన పూజారులు వేద మంత్రపఠనాలతో నిజాభిషేకం జరిపి తులసీదళాలతో సహస్రనా మార్చనలు నిర్వహించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి వెండి జోడు సేవల్లో తీర్చిద్దిన అర్చక స్వాములు మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం, సహస్ర నామార్చనలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. కొండ పైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యారాధనలు, సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని యాగశాలలో గణపతి హవన పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.13,48,787 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

గోపలాయపల్లి క్షేత్రంలో చక్రతీర్థం

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి క్షేత్రంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చక్రతర్థం నిర్వహించారు. ఆరు రోజులుగా పూజలందుకున్న స్వామివారి ఆయుధమైన చక్రాన్ని స్వామి వారి పుష్కరిణి వద్దకు చేర్చిన అర్చకులు వేద మంత్రాలతో చక్ర తీర్థం నిర్వహించారు. అంతకుముందు హోమం, పూర్ణాహుతి, బలిహరణ నిర్వహించారు. ఈ ఉత్సవంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ఓడిస్తాం: పిడమర్తి


మాదిగల జోడో యాత్రలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 28: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ఓడించి ఇంటికి సాగనంపుతామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రానికి చేరుకున్న మాదిగల జోడో యాత్రలో ఆయన మాట్లాడారు. మాట్లాడుతూ వర్గీకరణ హామీని నిలబెట్టుకోని బీజేపీకి తెలంగాణ రాష్ట్రంలో పుట్టగతులు లేకుండా చేస్తామన్నారు. సబ్బండ వర్గాలకు అవసరం లేని ఎన్నో బిల్లులను పార్లమెంట్ ద్వారా ప్రవేశపెట్టారని అట్టడుగు వర్గాలకు అవసరమైన ఏ ఒక్క చట్టాన్ని పార్లమెంటు ద్వారా ప్రవేశపెట్టలేదన్నారు. ఇది కేవలం కార్పొరేట్ అగ్రకులస్థుల కోసం పనిచేసే పార్టీ మాత్రమేనని అలాంటి బీజేపీని రాష్ట్రం నుంచి తరిమేయాల్సిన బాధ్యత మాదిగలపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కావాలంటే బీజేపీని ఓడించాలన్నారు. తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రధాన పార్టీలు మాదిగలకు మూడు పార్లమెంటు స్థానాలు కేటాయించాలన్నారు. తెలంగాణ దళిత బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల మల్లికార్జున్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద కులమైన మాదిగలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ యూత్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దున్న కొండల్, మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాతాకుల శేఖర్, మహా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు, బహుజన బోరెల్లి సురేష్, బెజవాడ శ్రవణ్, నక్క మహేష్, జోగు గణేష్, అదిమల్ల శంకర్, కౌన్సిలర్ ఏర్పుల రవి, పుల్లెంల సతీష్, నక్క సైదులు, కత్తి సైదులు, మీసాల మహేష్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఐస్‌క్రీం తయారీ: ఫ్యాక్టరీ సీజ్

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఘటన


ఆలేరులో పోలీసులు సీజ్ చేసిన ఐస్‌క్రీంలు తయారు చేసే ఫ్యాక్టరీ

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 28: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో అనుమతులు లేకుండా ఐస్‌క్రీంలు తయారు చేస్తున్న ఫ్యాక్టరీని పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఆలేరు ఎస్ఐ వెంకట శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలేరు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ పక్కన ఉన్న డైరీ ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఐస్‌క్రీంలు తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం తనిఖీ చేశారు. ఆ ఫ్యాక్టరీకి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఐస్‌క్రీం తయారు చేస్తున్నారని గుర్తించి వాటిని సీజ్ చేశారు. డైరీ ఐస్‌క్రీం ఫ్యాక్టరీ యజమాని మహ్మద్ చాంద్‌మియాపై కేసు నమోదుచేశారు. ఈ ఫ్యాక్టరీకి హైదరాబాద్, నల్లగొండలో ఉన్న పలు ఐస్‌క్రీం కంపెనీల నుంచి వివిధ రకాల ఐస్‌క్రీంలు ఇక్కడికి తెప్పించి, ఇక్కడి సిబ్బంది మండలంలోని పలు గ్రామాల్లో తిరుగుతూ విక్రయాలు కొనసాగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తుంగతుర్తి, ఫిబ్రవరి 28: బైకు, లారీ ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిన్నెంల గ్రామానికి చెందిన అనంతుల నాగరాజు, అతని స్నేహితుడు మహేష్ బైక్‌పై హైదరా బాద్‌కు వెళ్తుండగా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అనంతుల నాగరాజు బుధవారం ఉదయం మృతిచెందాడని తెలిపారు. నాగరాజు సోదరుడు యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భువనగిరి రూరల్: అతివేగంగా అజాగ్రత్తగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం మోటర్ సైకిలిస్టును ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని చందుపట్ల గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరికి చెందిన అనంత్‌కుమార్ మోటర్ సైకిల్‌పై రాయగిరి వైపునకు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

కొండమల్లేపల్లి: ముందు వెళ్తున్న డీసీఎం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుకున్న డీసీఎం ఢీకొంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో బుధవారం జరిగింది. మిర్యాలగూడ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న డీసీఎం మండల కేంద్రంలో ముందు వెళ్తున్న మరో డీసీఎం సడన్ బ్రేక్ వేయడంతో వెనుకున్న బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ శివరాంరెడ్డికి స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్టు

శాలిగౌరారం, ఫిబ్రవరి 28: ఇంటి మరమ్మతుల విషయంలో తరచూ ఘర్షణలు పడుతు క్షణికావేశంలో ఇటీవల అన్నను చంపిన తమ్ముడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నకిరేకల్ పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో శాలిగౌరారం సీఐ శ్రీనివాస్‌రెడ్డి అరెస్టు వివరాలు వెల్లడించారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో చర్లపల్లి పద్మకు పెద్దకుమారుడు రాంబాబు, చిన్న కుమారుడు నవీన్ ఉన్నారు. తల్లితో కలిసి అన్నదమ్ముళ్లు ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఇద్దరి మధ్య ఆరు సంవత్సరాలు నుంచి గొడవలు జరుగుతున్నాయి. పాత ఇంటికి మరమ్మతులు చేద్దామని, చెరిసగం డబ్బులు పెట్టుకుందామని అన్న రాంబాబు తమ్ముడు నవీన్‌ను అడిగాడు. తాను పైసలు ఇవ్వనని, తన వద్ద డబ్బులు లేవని నవీన్ చెప్పాడు. ఈ విషయం దృష్టిలో పెట్టుకుని తమ్ముడు నవీన్ అన్న రాంబాబును ఈనెల 26న ఇంట్లో కత్తిపీటతో నరికాడు. తలపై బండరాయితో మోది చంపాడు. కేసును నమోదు చేసి విచారణ చేసిన అనంతరం నిందితుడు నవీన్‌ను గ్రామంలో బుధవారం అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును నకిరేకల్ సీఐ రాజశేఖర్ చేధించారు. ఈ సమావేశంలో శాలిగౌరారం ఎస్ఐ ఎం. ఐలయ్య, కానిస్టేబుళ్లు సతీష్, దేవేందర్, నాగయ్య, లింగయ్య ఉన్నారు. హత్య కేసును త్వరగా చేధించినందుకు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి సిబ్బందిని అభినందించారు.

'హరితాహారం' మొక్కలు ఆగ్నికి ఆహుతి



మర్రిగూడ, ఫిబ్రవరి 28: రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితాహారం మొక్కలు ఆగ్నికి అహుతవుతున్నాయి. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట నుంచి లెంకలపల్లి వెళ్లే రహదారి ఇరువైపులా హరితాహారం పథకం ద్వారా మొక్కలు నాటి పెంచారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ చెట్లకు నిప్పు అంటించడంతో కాలిపోతున్నాయి.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

కోదాడ రూరల్, ఫిబ్రవరి 28: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని సూర్యాపేట జిల్లా కోదాడ మండల పోలీసులు బుధవారం పట్టుకున్నారు. విష్ణు, సాయి ఆంధ్రా నుంచి గంజాయి తీసుకొస్తుండగా పోలీసులు సాధారణ తనిఖీల్లో భాగంగా మండల పరిధిలోని చిమిర్యాల క్రాస్‌రోడ్డులో బుధవారం పట్టుకున్నట్లు సీఐ రజితరెడ్డి తెలిపారు. వారిని వద్ద 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి

- సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్


హాలియాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్

డిండి, దేవరకొండ, కొండమల్లేపల్లి, హాలియా, ఫిబ్రవరి 28: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ అన్నారు. నల్లగొండ జిల్లా డిండి, దేవరకొండ, కొండమల్లేపల్లి, హాలియాలలో బుధవారం సాగిన విజయ సంకల్పయాత్రలో ఆయన మాట్లాడారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసి కాశ్మీర్‌ను భారతదేశంలో అంతర్భాగం చేసిన ఘనత నరేంద్ర మోదిదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. రైతులకు ఇప్పటికి రైతులకు రైతుబంధు ఇవ్వలేదని దుయ్యబట్టారు. రూ.500కే సిలిండర్ అన్న సీఎం రేవంత్‌రెడ్డి మొత్తం సిలిండర్ డబ్బులు చెల్లించాలని చెబుతున్నారని తెలిపారు. మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ఎలా అధికారం చేపడుతుందని ఎద్దేవా చేశారు. హిందువుల రామ మందిర నిర్మాణం 500 సంవత్సరాల కల నరేంద్రమోదీ నాయకత్వంలో సహకారమైందన్నారు. ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టులను కాంగ్రెస్, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తిచేయాలని, దేవరకొండ ఖిల్లాతోపాటు దేవరచర్లను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. సాగర్‌లో కనిపిస్తున్న జాతీయ రహదారులు, వెలుగుతున్న లైట్లు, ఐదు కేజీల బియ్యం, ఉపాధి హామీ పనులు, సిమెంట్ రోడ్లు కేంద్ర ప్రభుత్వ అధ్వర్యంలోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుంభకోణాల పార్టీ కాంగ్రెస్‌కు ఓటు వేసి వృథా చేసుకోవద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధిక స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, నూకం నర్సింహారెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తోంద న్నారు. తెలంగాణలో జాతీయ రహదారులు, రైల్వేమార్గాలు మంజూరు చేసిందన్నారు. ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు వర్షిత్‌రెడ్డి, ఏటి కృష్ణ, లాలునాయక్, వానం నరేందర్‌రెడ్డి, బండారు ప్రసాద్, రాధిక, మౌనిక, నూకం నర్సింహరెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌గాంధీ, మన్మధ్ రెడ్డి, కేతావత్ లాలునాయక్, డాక్టర్ కళ్యాణ్‌నాయక్, నక్క వెంకటేష్‌యాదవ్, నివేదితరెడ్డి, గార్లపాటి జితేందర్, నారోజుపద్మ, నేతాళ్ల వెంకటేష్, బండారు ప్రసాద్, కంకణాల శ్రీధర్‌రెడ్డి, గుండాల వెంకటేష్‌యాదవ్, ఏటి కృష్ణ, జల్దా భాస్కర్, కొంపల్లి శ్రీనివాస్‌యాదవ్, మన్నెం రంజిత్‌యాదవ్, చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఉయ్యాల నర్సింహగౌడ్, జానకిరామయ్య, బొడిగ సాంబశివగౌడ్, పేర్ల జితేందర్, కుంభం యాదగిరి, పాక నగేశ్, భూతరాజు భరత్ ఉన్నారు.

సమాజానికి ఉపయోగపడే పరికరాలను కనుగొనాలి

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 28: ప్రఖ్యాత శాస్త్రవేత్త సీవీ.రామన్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే పరికరాలను కనుగొనాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.ప్రశాంతిరెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ విద్యాసంస్థల్లో బుధవారం సీవీ.రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధునాతనమైన కృత్రిమ మేధస్సు సదస్సుపై అవగాహన కల్పించారు. ఐటీ కోచింగ్ విద్యార్థులు అధునాతన మేధస్సుతో తయారు చేసిన పరికరాలు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రప్రథమంగా ట్రినిటీ విద్యాసంస్థల్లో అధునాతన కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ప్రవేశపెట్టడడం అభినందనీయమని ఆమె అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఏనుగుల వెంకట్‌రెడ్డి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ వి.మంజుల పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: నేటి విద్యార్థులే భావి శాస్త్రవేత్తలని అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ కర్లీ గీతాంజలి అన్నారు. మండలంలోని అనంతారం గురుకుల పాఠశాలలో నేషనల్ సైన్స్‌డేను పురస్కరించుకుని ప్రొఫెసర్ మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీవీ.రామన్ ప్రయోగాలు నేటి నిజజీవితంలో అనుభవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది అరుణ్‌కుమార్, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రెడ్డి, డి.డబ్ల్యూ రజిత, ఉపాధ్యాయులు శ్రీవాణి, అనురాధ, శ్రీలత, రోసినార, అమ్రిన్, కళ్యాణి, కృష్ణయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: విద్యార్థులు శాస్త్రీయదృక్పథం కలిగి ఉండాలని, సైన్స్ మానవులను చీకటినుంచి వెలుగువైపు నడిపిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పోచమ్మవాడ యాదగిరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన అనేక ప్రదర్శనలను తిలకించి, సంతృప్తిని వ్యక్తం చేసి, విద్యార్థులను అభినందించారు.

వలిగొండ: సైన్స్‌ఫెయిర్‌తో విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి పెరుగుతుందని పాఠశాల డైరెక్టర్ కొండూరు బాలరాజు తెలిపారు. మండల కేంద్రంలోని మాంటిస్సోరి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం థామస్ అబ్రహం, ఉపాధ్యాయులు అనూప్, మహేష్, జెరిన్, మను, డార్లి, కావ్య, స్వర్ణ పాల్గొన్నారు.

గుండాల: సైన్స్‌తోనే సమాజ పురోగతి ఉంటుందని ఇన్‌చార్జి హెడ్మాస్టర్ మెర్సిగ్రేస్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్ ఆర్ భాగ్యలక్ష్మీ, హరిత, జగన్, స్వప్న, మహేశ్, సీఆర్‌పీ లింగయ్య పాల్గొన్నారు.

తుర్కపల్లి: విజ్ఞాన శాస్త్రం అనేది సృజనాత్మకతను వెలికి తీసే సాధనమని ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సీవీ.రామన్‌రామన్ ఎఫెక్టును కనుగొన్న సందర్భంగా నిర్వహించిన జాతీయ విజ్ఞాన దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన కృత్యాలను ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వీక్షించారు. ఉపాధ్యాయులు బి.ఉపేందర్‌రావు, కే.వెంకటాచారి, జరీనాభానుబేగం, శ్రీనివాసాచారి ఉన్నారు.

మోత్కూరు : సైన్స్‌తో సమాజంలో ఎవరూ ఊహించని విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, దేశ ప్రగతి సైన్స్‌పైనే ఆధారపడి ఉందని పాటిమట్ల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.లింగమల్లు, మోత్కూరు అక్షర ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రాజిరెడ్డి అన్నారు. పాఠశాలల్లో వేర్వేరుగా సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. పాటిమట్ల పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ క్విజ్, టాలెంట్ టెస్టు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

బీబీనగర్: బీబీనగర్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పాండురంగ శర్మ, కెప్టెన్ రాఖీ చౌహాన్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు రామన్ ఎఫెక్టు, శాస్త్ర సాంకేతికరంగాలలో దేశం సాధించిన ప్రగతిని విద్యార్థులకు వివరించారు. విద్యార్థినులు నమూనాలను, పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వైస్ ప్రిన్సిపల్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.



బీబీనగర్: ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల ప్రయోగాలను పరిశీలిస్తున్న సిబ్బంది







గుండాలలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, తుర్కపల్లి: విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు, భువనగిరి రూరల్: అనంతారం పాఠశాలలో విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రుణాలు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలి



మోత్కూరు సింగిల్ విండో పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అశోక్‌రెడ్డి

మోత్కూరు, ఫిబ్రవరి 28: మోత్కూరు రైతు సేవా సహకార సంఘంలో రుణాలుతీసుకున్న రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి తమ రుణాలను రెన్యూవల్ చేసుకునేలా సంఘం డైరెక్టర్లు, సిబ్బంది కృషి చేయాలని సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి కోరారు. బుధవారం జరిగిన పాలక వర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సిబ్బంది వాయిదా మీరిన అప్పులను వెంటనే వసూలు చేయాలన్నారు. సంఘం గోదాం నిర్మాణ పనులు త్వరలోనే పూర్తవుతాయన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రూ.వెయ్యి చెల్లించి సంఘంలో సభ్యత్వం తీసుకోవచ్చన్నారు. మార్చి 27న సంఘం మహాజన సభ నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు పురుగుల మల్లయ్య, డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, కారుపోతుల ముత్తయ్య, సామ పద్మారెడ్డి, దేవసరి రాములు, బండ పద్మ, సుజాత, స్వామి, సంఘం సీఈవో కొణతం వరలక్ష్మీ పాల్గొన్నారు.

క్రోనోకార్పస్ చెట్లపై పరిశోధన చేయాలి : ఏబీవీపీ



ఏవో జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 28: పలు రకాల ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్న క్రోనోకార్పస్ చెట్లను తొలగించేందుకు సరైన పరిశోధన చేయాలని ఏబీవీపీ నాయకుడు శివ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఏబీవీపీ నాయకులు ఏవో జగన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో రోడ్ల వెంట ఈ చెట్లనే నాటారన్నారు. వీటితో ప్రాణాంతక వ్యాధులు సక్రమిస్తున్నాయని, తక్షణమే వీటిపై పరిశోధన జరిపి తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు అత్యంత ప్రాణాంతకమైన ఈ చెట్లను వెంటనే తొలగించాలన్నారు. వినతి అందజేసిన వారిలో సామల సాయికుమార్, ప్రణయ్, సిద్దు, ఉదయ్ పాల్గొన్నారు.

ఇంటిపన్ను సకాలంలో చెల్లించాలి: కమిషనర్

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 28: పట్టణ ప్రజలు ఇంటిపన్నులు, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కమిషనర్ కే.వీరారెడ్డి కోరారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పన్నులు చెల్లించి రశీదు పొందాలని సూచించారు. సమయానుకూలంగా పన్నులు చెల్లించని వారిపై మునిసిపల్ చట్టం -2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మార్చి 4న మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

మోత్కూరు, ఫిబ్రవరి 28: అవిశ్వాసంతో ఖాళీ అయిన మోత్కూరు మునిసిపల్ చైర్ పర్సన్ స్థానానికి మార్చి 4న ఎన్నిక నిర్వహించనున్నట్టు మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ తెలిపారు. మార్చి4న ఎన్నిక నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని, చైర్ పర్సన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ త్వరలోనే కౌన్సిలర్లకు నోటీసులు అందజేస్తామన్నారు. ఇది ఇలా ఉండగా మునిసిపాలిటీలో కాంగ్రెస్‌కు నలుగురు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్‌కు 8 మంది కౌన్సిలర్లు ఉన్నారు.

దళిత రైతులంటే చిన్న చూపు తగదు



సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

సంస్థాన్ నారాయణపురం ఫిబ్రవరి 28: దళిత రైతులంటే చిన్న చూపు తగదని పలువురు రైతులు అన్నారు. విద్యుత్ శాఖ ఏఈ చిన్న చూపు చూస్తున్నారని ఆరోపిస్తూ సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన పలువురు దళిత రైతులు బుధవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసనకు దిగారు. మండలంలోని పుట్టపాక గ్రామానికి చెందిన రైతు సుక్క మారయ్య గత నెల 28న బోరు మోటర్ కనెక్షన్‌కోసం ఏఈకి దరఖాస్తు చేసుకున్నాడు. కనెక్షన్‌కు నాలుగు స్తంభాలు అవసరమవుతాయని, వీటికి రూ.57,330 ప్రతిపాదనలు రూపొందించారని తెలిపారు. వ్యవసాయంతో ఒకటి రెండు ఎకరాల భూమి సాగు చేసుకునే రైతు వేల రూపాయలు ఎక్కడి నుంచి తెచ్చి చెల్లిస్తారని అన్నారు. ట్రాన్స్‌కో ఏఈకి ఎస్టిమేషన్‌పై అవగాహన లేదని, అధికారులతో కాకుండా సిబ్బందితో ఎస్టిమేషన్ వేయిస్తున్నారని చెప్పారు. .ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సుక్క మారయ్య, బరగాల మునలయ్య, సుక్క పెద్ద ముత్తయ్య, సుక్క చిన్న ముత్తయ్య, రాములు, సత్తయ్య, సంతోష, ఎల్లయ్య, యాదయ్య పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న రాజు

బొమ్మలరామారం, ఫిబ్రవరి 28: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకోవడం ఖాయమని తెలంగాణ స్టేట్ ఎస్టీ ఆదివాసి సెక్రటరి మూడావత్ రాజు నాయక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉండి సంపాదన పెంచుకున్న చరిత్ర బీఆర్‌ఎస్ నాయకులు కలిగి ఉండడంతోనే ప్రజల చేతిలో ఎన్నికల్లో ఘోరమైన ఓటమిని చవిచూశారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తమ లక్ష్యమని అన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

ఆత్మకూరు(ఎం) ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని రాంనగర్‌కాలనీలో ఓ కిరాణం దుకాణంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన పైళ్ల దామోదర్‌రెడ్డి తన కిరాణం దుకాణాన్ని రాత్రి 10గంటలకు మూసివేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి దుకాణం తీయడానికి రాగా తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా గల్లపెట్టెలో ఉన్న సుమారు రూ.60 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారని గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ డి.నాగరాజు తోపాటు క్లూస్ టీం బృందం సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీజేపీ, కాంగ్రెస్ రహస్య మిత్రులు: బీఆర్‌ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 28: బీజేపీ, కాంగ్రెస్ రహస్య మిత్రులని, మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ద్వారా స్పష్టమైందని బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, కొలుపుల అమరేందర్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య అన్నారు. మంగళవారం జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి రహస్యంగా సహకరించినందుకు ప్రతిఫలంగా ఆ పార్టీ బీజేపీకి వైస్‌చైర్మన్ పదవిని ఏకగ్రీవంగా అప్పటించిందన్నారు. బీఆర్‌ఎస్‌తోనే భువనగిరి పట్టణాభివృద్ధి జరిగిందన్నారు. సమావేశంలో నాయకులు ఏవీ.కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నియామకాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న జె శంకర్‌నాయక్ సంత్ సేవాలాల్ భగవాన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమితులైనట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని సంత్ సేవాలాల్ భగవాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనను రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమించినట్టు, తన నియామకానికి సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు.

భూదాన్‌పోచంపల్లి : మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయం నూతన చైర్మన్‌గా కేసారం సురేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయం ఆవరణలో జరిగిన నూతన కార్యవర్గంను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా గుండ్ల శ్రీరాములు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా పున్న నరేష్‌కుమార్ నేత, కోశాధికారిగా కంది మహేందర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా పాలకుర్ల నవీన్‌గౌడ్ ఎన్నికయ్యారు.

మోత్కూరు : మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు మాడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మోత్కూరు మండల మేరు సంఘం అధ్యక్షుడిగా పోల్కం శేషయ్య, ఉపాధ్యక్షునిగా శివ, ప్రధాన కార్యదర్శిగా రేణికుంట్ల రాము, కోశాధికారిగా తాడూరి నరేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాజాపేట: మండలంలోని నర్సాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బొంగోని ఉప్పలయ్య మాజీ ఎంపీటీసీ, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకరయ్య చేతుల మీదుగా అందుకున్నారు. ఆయనను నాయకులు గుంటి మధుసూదన్‌రెడ్డి, లావణ్య, జశ్వంత్, రవీందర్, వెంకట్‌రెడ్డి, సన్మానించారు.

సంక్షిప్తంగా..

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 28: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ నరాల నిర్మల అన్నారు. బుధవారం మండలంలోని బొల్లెపల్లిలో రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సిసి రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గడ్డమీది చంద్రకళ వీరస్వామి, మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి, పీఆర్ ఏఈ ప్రసాద్ గ్రామస్థులు పాల్గొన్నారు.

గుండాల: మండలంలోని సీతారాంపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న నవగ్రహాల ప్రతిష్ఠాపనలో భాగంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వేణుగోపాల చార్యులు, చలపతిరావు, ఎం.వేణుగోపాల్ రెడ్డి, శివారెడ్డి, సంతోష్‌రెడ్డి, ఎం.సురేశ్, కర్ణాకర్, వేణు, మల్లయ్య పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: సమాజ సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ పని చేస్తోందని రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి అధ్యక్షుడు పడమటి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి శివారులోని రాయిగిరి ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ పలుగుల ఆగేశ్వర్‌రావు, కోశాధికారి నేమూరి అశోక్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యాయులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, సత్యనారాయణ ఉన్నారు.

భువనగిరి రూరల్: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 5న ఉదయం 10.30 గంటలకు స్థానిక జడ్పీ కార్యాలయ సమావేశపు హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సీఈవో ఎన్ శోభారాణి తెలిపారు. జిల్లా అధికారులు, సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మోత్కూరు: పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు మధ్యకు వచ్చిన విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చడానికి మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ పర్యవేక్షణలో సిబ్బంది మార్కింగ్ ఇచ్చారు. రోడ్డు పరిధిలో తొలగించకుండా ఉన్న గృహ నిర్మాణాల యజమానులకు వెంటనే తొలగించుకోవాలని చెప్పారు.

మోత్కూరు : ప్రతీ ఏడాది కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టులో రాసిన విద్యార్థులకు తుది కీ విడుదల చేయాలని పలువురు కోరారు. ఫలితాలు ప్రకటించి, స్కాల్‌షిప్ అందించాలని పలువురు కోరారు.

రామన్నపేట: మండలంలోని సిరిపురం గ్రామంలో శివ భక్త మార్కెండేయ స్వామి దేవాలయంలో నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మల్లయ్యను కమీటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పున్న జగన్మోహన్, ఎంపీటీసీ బడుగు రమేష్, తాజా మాజీ సర్పంచ్, అప్పం లక్ష్మీనర్సు, మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు అప్పం రామేశ్వరం పాల్గొన్నారు.

రాజాపేట: మండలంలోని చల్లూరులోని యాదాద్రి మేడారం, చిన్న మేడారం, లక్ష్మకపల్లి గ్రామాల్లోని సమ్మక్క సారలమ్మ ఆలయాల వద్ద తిరుగు వారం పండుగ నిర్వహించారు. అమ్మవార్లకు బోనాలను సమర్పించారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తాటి రామచంద్రం మృతి పార్టీకి తీరని లోటని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం తాటి రామచంద్రం (85) మృతదేహంపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కాంగ్రెస్ చౌటుప్పల్ బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనా రెడ్డి , బోయ దేవేందర్, సుర్వి నర్సింహ్మా గౌడ్, ఎం.రమేష్ గౌడ్, చింతల సాయిలు ఉన్నారు.

గుండాల: మండలంలోని వెల్మజాల జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ సంగి బాలయ్య, ప్రధానోపాధ్యాయుడు పి.యాదగిరి, గొడుగు బాలరాజు, దామోదర్, నర్సిరెడ్డి ఉన్నారు.

దర్జీల సంక్షేమానికి కృషి: బీర్ల



ఆలేరులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 28: దర్జీల జీవన విధానం, వారు పడుతున్న కష్టాలు తెలుసని, వారి సంక్షేమానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం ఆలేరులో ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు టైలర్స్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు అభివృద్ధిలో అందరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. టైలర్స్ భవనం కోసం తన నిధుల నుంచి రూ.5లక్షలు ఇస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంధమల్ల అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాంద్రాజు వెంకటేశ్వర్‌రాజు, నీలం పద్మ, ఎజాజ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎగ్గిడి శ్రీశైలం, టైలర్స్ అసోసియేషన్ నాయకులు ఖలీల్ ఉన్నారు.

భువనగిరి రూరల్: కుట్టు మిషన్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న దర్జీలను అన్ని విధాలుగా ఆదుకోవాలని మేరు సంఘం పట్టణ అధ్యక్షుడు కీర్తి సత్యనారాయణ అన్నారు. టైలర్స్‌డేను పురస్కరించుకుని బుధవారం స్థానిక మేరు సంఘం కార్యాలయంలో శంకరదాసమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ మేరు వృత్తిదారులైన మోలుగురు నరసింహ, రేణికుంట్ల వెంకటేష్, పోల్కం రాములు, కొత్త నరసింహస్వామి, గుంటి శ్రీశైలంను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు తాళ్ల భాస్కర్, మేడిగ జగదీష్, మోలుగురి గౌరీ శంకర్, ఆదిమూలం బాలరాజ్, మేడిగా నవనీత, ఆదిమూలం పరమేష్, వారణాసి మహేష్, బిక్షపతి, లక్ష్మీనారాయణ ఉన్నారు.



భువనగిరిలో టైలర్లను సన్మానిస్తున్న మేరు సంఘం ప్రతినిధులు

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మార సంఘమేశ్వర్, ప్రధాన కార్యదర్శి గుంటి వెంకటేశ్వర్లు, కనకయ్య, పరమేష్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామన్నపేట: మండల కేంద్రంలో కుట్టు మిషన్ రూపకర్త విలియమ్స్ హేవే జెండాను సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మల్లయ్య, ఆవిష్కరించారు. అనంతరం కేక్ రట్ చేసి టైలర్స్ అసోసియేషన్ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు పున్న జగన్మోహన్, బడుగు రమేష్, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, కందుల హనుమంతు, గాదే నరేందర్, పున్న వెంకటేష్, టైలర్ అసోసియేషన్ నాయకులు ఎండి.నజీర్, సంగిశెట్టి వేణుగోపాల్, షేక్‌షబ్బీర్, పిట్టల శ్రీను, అతిక్‌బాబా, ఏలూరి రవి, చేరుకు సాయికుమార్, తగ్రెజ్, కిషన్, ఏలూరి కుమార్ ఉన్నారు.

బంజారాల బతుకులు మారాలి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



బోగ్‌బండార్ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం, ఫిబ్రవరి 28: బంజారా భవనాలు నిర్మించుకోవడం కాదు.. ముందుగా బంజారాల బతుకులు మారాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నా రు. సంస్థాన్‌నారాయణపురంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ 285 జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోగ్ బండార్ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా గిరిజనుల బతుకుల్లో పూర్తిస్థాయిలో మార్పురాలేదని ఆయన అన్నారు. గిరిజనులు తమ ఆత్మగౌరవం కోసం బంజారా భవనాలను నిర్మించుకోవడం ఎంత ముఖ్యమో ఆర్థికంగా అభివృద్ధి చెందడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని ఆయన తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ ఆనాడు జంతుబలి, మూఢనమ్మకాలు, మత్తు పానీయాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు. సేవాలాల్‌ను స్ఫూర్తిగా తీసుకొని నేను కూడా మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపులను మూసి వేయించానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీలు గుత్తా ఉమాదేవి ప్రేమ్చందర్ రెడ్డి, తాడూరి వెంకట్ రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర రెడ్డి, ఉత్సవాల ఇంచార్జీ అధికారి రాజ్‌కుమార్, బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కరెంటోతు బిక్షపతి నాయక్, ప్రవీణ్ నాయక్, నాయకులు వాంకుడోత్ బుజ్జి, ముద్దంగుల నరసింహ, ఉప్పల లింగస్వామి, పిల్లలమర్రి శ్రీనివాస్, కిషన్, సాగర్, ఏపూరి సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి అథ్లెట్ క్రీడాకారిణి సబావత్ రాజేశ్వరికి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ తరఫున ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి 25వేల రూపాయల చెక్కును అందజేశారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



మోత్కూరులో పరీక్ష కేంద్రంలో హాజరైన విద్యార్థులు

మోత్కూరు, ఫిబ్రవరి 28: మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో బుధవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులను కళాశాల గేట్ వద్ద సిబ్బంది తనిఖీచేసి లోపలికి పంపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. బుధవారం 446 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 27 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ప్రభుజస్టీస్ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసిందన్నారు. బుధవారం నుంచి మార్చి 16న పరీక్షలు ముగిసే వరకు పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని తహసీల్దార్ రాంప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలోని ఐదు కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 987 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ కేంద్రాలకు 1060మంది విద్యార్థులను అలాట్‌మెంట్ చేయగా, 73మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్టు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

యాదగిరిగుట్ట రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 218 మంది విద్యార్థులకు గాను 213 మంది హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

భూదాన్‌పోచంపల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ కేంద్రంలో 142 మందికి గాను 140 మంది హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరైనారు. టీఎస్ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 162 మందికి గాను 160 మంది విద్యార్థులు హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి తనిఖీ చేశారు.

వలిగొండ: పట్టణంలోని వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 145 మంది విద్యార్థులకు గాను 142 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ తెలిపారు. లోతుకుంట మోడల్ స్కూల్‌లో 175 మందికి గాను 6గురు విద్యార్థులు గైర్హాజరు కాగా 172 హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ జి.రాము తెలిపారు.

రామన్నపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 111 మంది విద్యార్థులకు గాను ఆరుగురు విద్యార్థులు గైర్హాజర్ కాగా, శ్రీ హిందూ కళాశాలలో 198 మంది గాను 33 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రాల నిర్వహణధికారులు శివకోటి, పనకంటి భాస్కర్‌రావు తెలిపారు.



చౌటుప్పల్‌లో తొలిగిరోజు పరీక్షకు ఉత్సాహంగా హాజరైన విద్యార్థినులు



మోత్కూరులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది